

# సహచరి

- వైష్ణవి

సంధ్య దాటింది, చీకటి ముసిరింది.. కాలం నడుస్తోంది.. అర్ధరాత్రి...

అప్పుడే మాగన్నుగా నిద్ర రెప్పల మీదికి కమ్ముకొస్తోంది.

దబ్బున పైనుంచి ఏదో బరువుగా పడిన చప్పుడు, ఇల్లంతా యధేచ్ఛగా తిరుగుతున్న జీవరాసులన్నీ కకావికలై పరుగులెత్తుతున్న సందడి, ఎన్నో ఏళ్ల అనుభవాన్నిబట్టి ఏం జరిగుంటుందో అర్ధమైంది. వెదురుగడల మంచం మీద చప్పుడుకాకుండా పక్కకి వొత్తిగిల్లి చూపుల్ని కూడదీసుకుని చూసాను. నూనె దీపం మసక వెలుతురులో నేలపైన చుట్టచుట్టుకొని పడగ పైకెత్తి నిలిచిన మిన్నాగు ఎలుకల్ని వేటాడుతోంది. రాత్రైతే చాలు లోపలికొచ్చి సేదతీరే కప్పలన్నీ గోడలమీద గెంతుతూ పైపైకి పోతున్నాయి. నా మంచానికి ఎదురుగా ఉన్న వంట గట్టుమీద ఎలుకలకోసం నేను చేసి పెట్టిన రొట్టెల్ని దౌర్జన్యంగా తింటున్న పందికొక్కు ఒకటి నిర్ఘాంతపోయి కదలిక మరచి కొయ్యబారిపోయింది. ఆ పక్క పుస్తకాల రేక్‌లో ఉడుత పిల్లలకి అడ్డంగా తోకను మూసి శిలాప్రతిమలా అయిపోయింది.

పాము బుస గదినిండా ప్రతిధ్వనిస్తోంది.

కాస్సేపటికి దేన్నో నోట చిక్కించుకున్నట్టుంది, బుస ఆగింది. దానికి ఆహారంగా చిక్కిన ప్రాణి హృదయ విదారకంగా విలవిల లాడింది. ఇంకాస్సేపట్లో గది మొత్తం శబ్ద రహితమైపోయింది.

ముప్ఫై ఏళ్లుగా ఇదంతా అలవాటైన తతంగమే. ఇప్పుడంటే పాపికొండల సందర్శనకోసం వచ్చే టూరిస్టులాంచీల రొదకు భయపడి రావడం మానేసాయి కాని, పగటి పూట కూడా కుందేళ్లు, లేళ్లు ఇంట్లోకొచ్చి విశ్రాంతి తీసుకునేవి. అడవి పందులు, చిరుత పులులు వాకిట్లో పచార్లు చేసేవి. గది, ఇల్లు, నివాసం, హోమ్ అంటూ నేను ఎన్ని రకాల పేర్లతో పిల్చుకున్నా ఇది పూర్తిగా వెదురు గడలతో నిర్మించిన ఆవాసం, ముఖర్జీ దీన్ని కుటీరం అనేవాడు.

దీనికానుకుని నదివైపు దిగువకు ఉన్న పది పన్నెండు గుడిసెల గిరిజన గూడెం గాఢ నిద్రలో ఉన్నట్టుంది. నాలుగైదు రోజులుగా వరద నదిలో కొట్టుకొచ్చిన చెట్లనూ, దుంగల్నీ వొడ్డుకు చేరుస్తూ పగలూరాత్రీ గూడెం మొత్తం అలసిపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా ఏమాత్రం మారని గిరిజన జీవితాలు-

కొంగును తలమీదుగా కప్పుకొని రాతి చప్టామీద కూర్చున్నాను. వెన్నెల రోజులు కాని, ఆకాశం మేఘావృతమై ఉండడంవలన చందమామ జాడ కానరావడంలేదు. దట్టమైన వృక్షాల ఆకుల సందుల్లోంచి మసక వెన్నెల ఉండీలేనట్టు కమ్ముకుని ఉంది.

ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి రూ. 1,000/-గెల్చుకున్న రచన

ఉధృతి తగ్గిన గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తున్న సవ్వడి, మోచేతిని నుదుటికి ఆనించుకుని కళ్లు మూసుకున్నాను, నిద్రకు దూరమైన రెప్పలు మూతపడలేదు. లేచి తలుపు తీసుకుని వాకిట్లోకొచ్చాను. చల్లని గాలి హోరుమని ముసురుకుంది. కొంగును తలమీదుగా కప్పుకొని రాతి చప్టామీద కూర్చున్నాను. వెన్నెల రోజులు కాని, ఆకాశం మేఘావృతమై ఉండడంవలన చందమామ జాడ కానరావడంలేదు. దట్టమైన వృక్షాల ఆకుల సందుల్లోంచి మసక వెన్నెల ఉండీలేనట్టు కమ్ముకుని ఉంది. దూరంగా కొండరాళ్ల సందుల్లో పుట్టిన సన్నని జలధార గలగలమని కిందికి ప్రవహించి గోదావరి వైపుగా సాగిపోతోంది. చప్టా మీంచి లేచి నాలుగుబారలు ముందుకు నడిచి ధారలో పాదాలు పెట్టి వొడ్డున కూర్చున్నాను. కొండ వృక్షాల మీది తేనె పట్టులనుంచి ఆగి ఆగి తేనె చుక్కలు చుక్కలుగా నీటి ప్రవాహంలో రాలిపడుతున్న చప్పుడు.

ఏడాది క్రితం ముఖర్జీ ఈ లోకాన్ని విడిచి వెళ్లేవరకూ కాలమే తెలీని నాకు ఇప్పుడు జీవితం ఎంత సుదీర్ఘంగా, మందకొడిగా సాగుతోంది!... అన్పిస్తోంది. ఎప్పటెప్పటి జ్ఞాపకాలో వెల్లువెత్తి వస్తున్నాయి.

స్వతంత్రం రావడానికి ముందు సంస్థానాలు, జమీందారీలు దేదీప్యమానంగా వెలుగుతున్న రోజులు. గోదావరి జిల్లాలోని ఓ ప్రఖ్యాత సంస్థానాధీశుడి కూతురుగా పుట్టిన నేను ప్లస్ టు వరకూ మద్రాసులో ఇంగ్లీష్‌లో చదివేను. అప్పటికే రవీంద్రుడి రచనల ప్రభావం ఆసాంతం నన్నలముకున్న రోజులు, శాంతి నికేతన్‌లో చదువుకుంటానన్న నా మాటను నాన్నగారు కాదనలేదు. తన కూతురు అక్కడ చదవడం గొప్ప స్టేటస్ సింబల్‌గా భావించారాయన.

ఫైనార్ట్స్ స్టూడెంటు ముఖర్జీ అక్కడే పరిచయమయ్యాడు. అప్పటి అతని రూపం ఇప్పుడే చూస్తున్నంత ప్రస్ఫుటంగా కళ్లముందుకొచ్చింది. అతను లేండ్ స్కేప్స్ బాగా గీస్తున్నాడని విని లేడీస్ హాస్టల్‌నుంచి ఆర్ట్ లవర్స్ కొందరం అతని రూంకెళ్లాం.

గది నిండా అస్తవ్యస్తంగా పరచి ఉన్న చిత్రాలు. గది మధ్యలో బాసింపట్టు వేసుకుని ధ్యానముద్రలో బుద్ధభగవానుడిలాగా అర్థనిమీలిత నేత్రుడై కూర్చుని ఉన్నాడు ముఖర్జీ. ఒక్కసారిగా అయిదారుగురు అమ్మాయిల్ని చూసి కంగారుపడ్డాడు. అప్పటికే మా మహల్‌లో చాలా చిత్రాల్ని మనసుపెట్టి చూసి ఉండడంవలన అతని చిత్రాల్ని బేరీజు వెయ్యడం కొంత సాధ్యమైంది నాకు. మాకన్నా సీనియర్ అయిన అతనికి సలహాలివ్వచ్చో లేదో ఆలోచించకుండా పెద్ద ఆరిందాలాగా కలర్ మిక్సింగ్ గురించీ, రూప లావణ్యం గురించీ ఏదేదో మాట్లాడేసాను, తర్వాత స్ఫురించి అతనేమనుకుంటున్నాడో అని చూస్తే దట్టమైన కనుబొమల కింద, విశాలమైన నేత్రాల లోతుల్లోంచి ఆసక్తిగా నన్నే చూస్తున్నాడన్పించింది.

ఆ పరిచయం స్నేహంగా మారి గాఢమైన మైత్రి కావడానికి ఎన్నాళ్లో పట్టలేదు. శాంతినికేతన్ పక్కనే ప్రవహించే కొప్పాయ్ నది వొడ్డున కూర్చుని ఎన్నెన్నో కబుర్లు కలబోసుకునేవాళ్లం, దేశ విదేశాల్లోని ప్రముఖ ఆర్టిస్టుల గురించీ, వాళ్ల కళానైపుణ్యం గురించీ అనర్గళంగా మాట్లాడేవాడు ముఖర్జీ. అచ్చమైన బెంగాలీ బాబులాగే ఉండేవాడు. అప్పుడప్పుడు నేనతన్ని 'నువ్వంతా కాదు కానీ నీ ముక్కు మాత్రం అచ్చమైన బెంగాలీ చప్పిడి ముక్కు' అని ఆటపట్టించేదాన్ని, అతను విశాలమైన నవ్వొకటి నవ్వి మౌనంగా ఉండిపోయేవాడు.

క్రమంగా ముఖర్జీ ఆర్టు, లోకానికి పరిచయం కావడం మొదలైంది. సెకండియర్ సెలవుల్లో నేనతన్ని మా వూరికి ఆహ్వానించేను. మా మహల్ సౌందర్యం, ప్రాచీనకాలంనాటి కళాఖండాలు, విదేశాలనుంచి తెప్పించిన విలువైన వస్తువులు అతన్నెంతో ఆకట్టుకున్నాయి. ఇంటికి వస్తూనే నేను నా నగలన్నీ అలంకరించుకుని సాంప్రదాయ అలంకరణలోకి మారిపోయాను. అది చూసి ముసిముసిగా నవ్వుతూండేవాడు. ఆ అలంకరణలోని నా రూపాన్ని అద్భుతంగా చిత్రించి నాకు ప్రెజెంట్ చేసాడు.

చిన్నప్పుడొకసారి గోదావరి నదిమీద పడవలో భద్రాచలం వెళ్లిన ప్రయాణం గుర్తుకొచ్చింది. ఆ అందమంతా ముఖర్జీలాంటి ఆర్టిస్టు చూసి తీరాలన్పించింది. నాన్నగారినడిగి ఏర్పాట్లుచేయించి తెరచాప పడవలో వెళ్లాం. దారి పొడవునా, ముఖ్యంగా పాపికొండల దగ్గర ముఖర్జీ అవుట్ లైన్స్ తిరిగి వచ్చేటప్పుడు అనుకోకుండా ఈ గిరిజన గూడెంలో దిగి, ఈ పరిసరాలన్నీ చూస్తూ పరవశంలో మునిగిపోయినప్పుడు తెలీలేదు కొన్నేళ్ల తర్వాత మేమిక్కడ స్థిరపడబోతున్నామని.

ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే దేశ విభజన గొడవలు ఉధృతమయ్యాయి. ఇక చదువు చాలించి వెనక్కి రమ్మని నాన్నగారు కబురుచేసారు. అప్పటికే రెండుసార్లు గాంధీజీ కల్‌కత్తా వచ్చినప్పుడు ముఖర్జీతోబాటు నేను కూడా వెళ్లేను. ఆ ప్రభావంతో ఖద్దరు కట్టడం ప్రారంభించాం ఇద్దరం.

ఒకసారి కల్‌కత్తాలో ముఖర్జీ చిత్రాల ప్రదర్శన ఏర్పాటుచేసాం. అతని గురించి పత్రికలు విపులంగా రాసాయి. ఆ వార్త ఖండాంతరాల్లోకి వెళ్లింది. చాలా కళాఖండాలు అమ్ముడుపోయాయి. వచ్చిన డబ్బును స్వాతంత్ర్య పోరాట నిధికి ఇచ్చేసాడు ముఖర్జీ. అప్పుడే నాకతని మీద ప్రేమలాంటిదేదో జనిస్తోందని అర్థమైంది.

నాన్న ఈసారి మనిషిని పంపించారు. ఇంటికెళ్లగానే నాకు తెలిసిందేంటంటే భార్య పోయిన మరో జాగీర్దారుతో నా పెళ్లి నిశ్చయించేసారని. పుస్తకాలూ , సర్టిఫికెట్లు తెచ్చుకుంటానంటే కూడా ఇల్లు కదలనీయలేదు. నేను కలవరపడి ముఖర్జీకి ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు. రేపు నా వివాహం జరగాల్సి ఉండగా ఈ అర్ధరాత్రి హఠాత్తుగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటన వెలువడింది. అంతా ఆ ఉత్సవాల సంరంభంలో ఉండగా నన్ను చిన్నప్పుడు పెంచిన ఆయా సాయంతో ఇంట్లోంచి బైటికి వచ్చి కలకత్తా వెళ్లిపోయాను. ముఖర్జీ శాంతినికేతన్‌లో లేడు, అతని స్నేహితుల్ని అడిగితే తెలిసింది శాంతి నికేతన్ వదిలి పల్లెకు వెళ్లిపోయాడని.

నేనతన్ని వెతుక్కుంటూ ఆ చిన్న పల్లెకు వెళ్లేను. బెంగాల్ విభజింపబడింది. కొట్లాటలు, చంపుకోవడాలు కొనసాగుతున్నాయి. దేశం అల్లకల్లోలంగా ఉంది.

ముఖర్జీ తల్లినీ, తండ్రినీ దౌర్జన్యకారులు చంపేసారు. పోతపోసిన దుఃఖమూర్తిలా చీకటి నిండిన ఇంట్లో ఒక్కడే ఉన్నాడు ముఖర్జీ, నేను వెళ్లి అతనిముందు మోకాళ మీద కూర్చున్నాను. ఎవరో వచ్చి దీపం వెలిగించి వెళ్లేరు.

ఒక్క నిముషం నమ్మలేనట్టు చూసాడు. నా భుజంమీద తలవాల్చేసి వెక్కివెక్కి ఏడ్చాడు. అతని దుఃఖం తీరేవరకూ ఏడ్వనిచ్చాను. అతని బంధువులెవరో తెచ్చిపెట్టిన రొట్టె, పళ్లు తిని కడుపు నింపుకొన్నాం.

ఒక నిర్లిప్త మానసిక స్థితిలో దేశం వదిలి వెళ్లాలని ఒక నిర్ణయానికి వచ్చాం. రాత్రికిరాత్రే కలకత్తా చేరుకున్నాం. చాలామంది విదేశీయులు దేశాన్ని వదిలివెళ్తున్న రష్, ఎలాగో టిక్కెట్లు సంపాదించుకుని ఓడ ఎక్కి దేశాన్ని వదిలేసాం.

ఆ రోజుల్లో చిత్రకారులందరిలాగే ముఖర్జీ కూడా పేరిస్‌నే ఇష్టపడ్డాడు. నా వెంట తెచ్చిన డబ్బు మా ప్రయా ణానికి, పేరిస్‌లో మేం సెటిలవ్వడానికి ఉపయో గపడింది.

మా వాళ్లు మమ్మల్ని వెంటాడి వేధిస్తారేమోనని మేం భయపడినంతగా ఏమీ జరగలేదు. భారతదేశంలో జాగీర్లన్నిటినీ ప్రభుత్వం రద్దుచేసిందని తెలిసింది.

పేరిస్‌లో గొప్ప ఆర్టిస్ట్‌గా పేరుతెచ్చుకోడానికి ముఖర్జీకి ఎక్కువకాలం పట్టలేదు. పల్లెలోనే మేమిద్దరం ఒకరికొకరం అని ప్రోమిస్ చేసుకున్నాం. పేరిస్‌లో ముఖర్జీ ఎక్కడో రెండు పూలమాలలు సంపాదించుకొచ్చాడు. పది మంది మిత్రుల ఎదుట దండలు మార్చుకొని ఇద్దరం ఒక్కటయ్యాం, మాది గొప్ప ఆత్మీయబంధం అని నా భావన.

ఆర్ట్ తర్వాతి స్థానం ముఖర్జీ పేరిస్‌లోని కింగ్స్ లైబ్రరీకిచ్చేవాడు. ఆ లైబ్రరీ మా మనసులు వికసించడానికీ, జ్ఞాన సముపార్జనకీ ఎంతగానో తోడ్పడింది. 1730లో ఫాదర్ లీగేక్ అనంతపురం నుంచి కింగ్స్ లైబ్రరీకి పంపించిన వేమన పద్యాల ప్రతిమీద నాచేత ఇంగ్లీష్‌లో వర్క్ చేయించాడు. యూరప్ మొత్తం తిరుగుతూ ఆర్ట్ గురించి ఉపన్యాసాలిచ్చాడు. ఎన్నో సెమినార్స్‌లో పాల్గొన్నాడు. ఎక్కడికెళ్లినా తన బెటర్ హాఫ్‌గా నన్ను పరిచయంచేసి తన ఉన్నతి వెనక నేనున్నానని చెప్పేవాడు.

ముప్ఫయ్యేళ్ల తర్వాత ఉన్నట్టుండి విదేశీ జీవితం మొహం మొత్తిపోయిందన్నాడు. 'దేవికారాణి- రోరిచ్ లాగా మనం కూడా ఇండియాలో ఎక్కడైనా సెటిల వుదాం' అన్నాడు.


అప్పటికి ఇద్దరం యాభయ్యవ పడిలో ఉన్నాం.


"నీకు గుర్తుందా, గోదావరి మీద మన పడవ ప్రయాణం? దారిలో మనం ఆగిన గిరిజన గూడెం, అక్కడికెళ్లిపోదామా? రోరిచ్ హిమాలయాల్ని ఎంచుకున్నట్టు నేను తూర్పుకనుమల్ని ఎంచుకుంటు న్నాను. ఒక్క పాపి కొండల అందాల్ని చిత్రించడానికే సగం జీవితకాలం పడుతుంది" అన్నాడు.

అతను మాట్లాడిన పదాలేవైనా అర్థం మాత్రం 'నీ వూరికి, నీ గోదావరికి దగ్గర్లో నిన్ను చేరుస్తాను' అనే స్ఫురించింది నాకు.

ఇండియాకి వచ్చాక తెల్సింది- దూరంలో ఉండి మేం విన్నదానికన్నా ఇక్కడి జాగీర్లు ఎంతగా చితికిపోయాయో! గొప్ప భేషజంతో జీవించడం తమ జన్మహక్కుగా భావించిన జాగీర్దార్ల కుటుంబాలు క్రమక్రమంగా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోయాయి.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

రాజాకోట అన్పించుకున్న మా హవేలీ మూడొంతులు కూలిపోయింది. చాలావరకూ ఆక్రమణలకు గురైపోయింది. కూలకుండా మిగిలిన ఒక గది, హాలులో సగభాగంలో దాసీ పుత్రుడొకాయన వండుకు తింటూ బతుకు వెళ్లమారుస్తున్నాడు. ఎవరూ తీసుకెళ్లకుండా వదిలేసిన అంచులు పగిలిపోయిన పింగాణీ సామాను, నేలలో స్థాపితం చేసేసిన పాదాల్తో ఒక పాత సైనికుడి ఇనప విగ్రహం, చెదలు సగం తినేసిన పుస్తకాలు మధ్య జీవచ్ఛవంలా కన్పించాడతను. ఎప్పటిదో మాసిపోయిన ఫొటో ఆల్బమ్ ఒకటి పదిలంగా దాచుకున్నాడు. నన్ను అతను గుర్తుపట్టలేదు. మా నాన్నగారు, అన్నయ్యలు అంటూ నాన్నగారివి, అన్నయ్యలవి ఫొటోలు చూపించాడు.

నాన్నగారు, అమ్మ, నా తోడబుట్టినవాళ్లు ఎవరూ మిగిలి లేరు. నా అన్నదమ్ముల పిల్లలు మద్రాసులో కొందరు, హైదరాబాదులో కొందరు ఏవో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుతున్నారని తెల్సింది.

రవీంద్రనాథ ఠాగూర్ ఈ ప్రాంతానికొచ్చినప్పుడు ఆయన బసచేయడానికి మేడపైన నాన్నగారు ప్రత్యేకంగా కట్టించిన గది మాత్రం చెక్కుచెదరకుండా అలాగే నిలిచి ఉంది. వెనకవైపు బూజుల్తో నిండిపోయిన మ్యూజిక్ హాల్లో రెండు వీణపెట్టెలు చూసి వాటిని తెరిపించాను. నేను చిన్నప్పుడు గురుముఖంగా సంగీత సాధన చేసిన చిన్నవీణ, మరో పెట్టెలో అమ్మ వాయించిన తంజావూరు వీణ- నేను ఆప్యాయంగా వాటిని నిమరడం చూసి "అమ్మగారూ! వీటిని మీరు కొంటారా" అన్నాడతను ఆశగా.

అతను చెప్పిన ధరకన్నా కొంత ఎక్కువే ఇచ్చి బెనర్జీ ఆ వీణల్ని నాకోసం కొన్నాడు.

ఆ వ్యక్తి కర్రలపొయ్యి పెట్టి వంట చేసుకుంటున్న ఆ విశాలమైన వరండాలో సింహాసనం మీద కూర్చుని ఉదయాన్నే అమ్మ అందరికీ పాలు, పెరుగు పంచిన రోజులు; రోజంతా వండించి వార్పించి ఆకలని వచ్చినవారికి లేదనకుండా కడుపునింపి; అర్థించిన వాళ్లకి ఆర్థికసాయం చేసి పంపించిన ఆ రోజుల వైభవం గుర్తొచ్చి నా కళ్లలో ఒక సన్నని నీటి పొర నిండింది. ఓడలు బళ్లుకావడం అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూసినట్లైంది.

కాలం ఎంత బలీయమైంది!

మేం అనుకున్న గిరిజన గూడెం చేరడానికి ముందుగా రాజమండ్రి వెళ్లాం. అక్కడ గోదావరిలో ఇదివరకటిలా గూటి పడవలు లేవు. ఆయిల్‌తో నడిచే మోటార్ లాంచీలున్నాయి. లాంచీ గోదావరి మధ్యలో ఉండగా ముఖర్జీ తను టాప్ పైకెక్కి నాకు చెయ్యందించేడు. ఆ అద్భుతమైన ప్రకృతి సౌందర్యం మధ్య ముఖర్జీమీద ప్రేమ పొంగి పొరలింది నాలో.

"ముఖీ! నువ్వు ముప్పై ఏళ్ల క్రితం ఎలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావు తెలుసా" అన్నాను అతని దగ్గరకు జరిగి.

"నువ్వూ అంతేలే, మనమిద్దరం ఒకరికొకరం పాపాయిలం కదా!" అన్నాడు నవ్వుతూ.

మాకు సంతానం కలగలేదు, ఎవరిలో లోపమో తెలుసుకోదల్చుకోక టెస్టులు చేయించుకోలేదు.

గూడెంలో ఉండడానికి గిరిజనుల అనుమతి కోరినప్పుడు మేం మత మార్పిడికోసం వచ్చామనుకుని రెండురోజులు వాళ్లు మాతో మాట్లాడలేదు. గిరిజనులు వాళ్ల మూల సంస్కృతిని కోల్పోడానికి ఇష్టపడరు. నేను వాళ్లకి అర్థమయ్యేలా వివరించి చెప్పేసరికి వాళ్లే గూడేనికి ఎగువన కొండవాలు శుభ్రంచేసి ఇంత పెద్ద బేంబూహట్ నిర్మించి ఇచ్చేరు. అప్పట్నుంచీ మేమూ వాళ్లలో ఒక కుటుంబం అయిపోయాం. నెలకొకసారి ముఖర్జీ అటు భద్రాచలానికో, ఇటు రాజమండ్రికో వెళ్లి అందరికీ కావాల్సిన సరుకులు కొనుక్కొచ్చేవాడు. అడవి దిగుబడులు కొనే దళారులొచ్చినప్పుడు దగ్గరుండి తూకాలు, లెక్కలు సరిచూసి గిరిజనులు మోసపోకుండా చూసేవాడు.

నేను పేరిస్‌లో తోచక నేర్చుకున్న వైద్యం కొన్నిసార్లు గిరిజనుల ప్రాణాల్ని కాపాడింది. నేనూ వాళ్లనుంచి అమూల్యమైన మూలికా వైద్యం తెలుసుకున్నాను.

విశాలమైన వరండాలో సింహాసనం మీద కూర్చుని ఉదయాన్నే అమ్మ అందరికీ పాలు, పెరుగు పంచిన రోజులు; రోజంతా వండించి వార్పించి ఆకలని వచ్చినవారికి లేదనకుండా కడుపునింపి; అర్థించిన వాళ్లకి ఆర్థికసాయం చేసి పంపించిన ఆ రోజుల వైభవం గుర్తొచ్చి నా కళ్లలో ఒక సన్నని నీటి పొర నిండింది.

చుట్టుపక్కల గూడేల ప్రజలకి వైద్యం చెయ్యడం, చదువు నేర్పించడం నేను చేసేదాన్ని. వెదురును పల్చని రేకులుగా చీల్చి, అడవి కలపను చెక్కి అందమైన కళాకృతుల్ని తయారుచెయ్యడం బెనర్జీ నేర్పించేవాడు. పని నేర్చుకోవడంలో షార్ప్‌గా ఉండే గిరిజనులకది కొంత ఆర్థిక వనరు కల్పించడానికి తోడ్పడింది. గిరిజనులు నమ్మితే ప్రాణం పెడతారు. అందుకే ఎన్ని రోజులు దేశంలో ఎక్కడెక్కడ తిరిగి వచ్చినా ఇదే మా స్థిర నివాసమైపోయింది.

మేం బైట నగరాలకు వెళ్లినప్పుడల్లా తెలిసేది దేశంలో ఎన్నెన్ని మార్పులు సంభవిస్తున్నాయో! సౌకర్యాలతోబాటు అసౌకర్యాలెన్నో! నాగరికత పేరుతో వస్త్రధారణలోనూ, జీవన విధానాల్లోనూ వచ్చిన మార్పుల్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. ఎందరెందరు కొత్త దేవుళ్ల సృజన జరుగుతోంది! నేనలా అంటే "మనం ఆగిపోయాం. వాళ్లు ప్రవాహంలో ఉన్నారు, అదే సహజం" అనేవాడు ముఖర్జీ.

నీళ్ల చల్లదనం క్రమంగా శరీరంలోకి పాకి వజవజ వణుకుపుట్టింది. గత స్మృతుల్లో పడి వయసు మరచిపోయి చటుక్కున లేవబోయాను. సహకరించని కాళ్లు నా ఎనభై ఏళ్ల వయస్సును గుర్తుకుతెచ్చాయి. సూర్యోదయం కాబోతున్న గుర్తుగా పాపికొండలకవతల సన్నని వెలుగు రేఖలు.

నిన్న సాయంకాలం సొరబ వాకిట్లో చేర్చిపెట్టిన ఎండుటాకులు, చితుకులు అగ్గిపుల్లతో ముట్టించాను. చిటపటలాడుతూ మంట ప్రారంభమైంది. ఆ మంట వెలుగులో పాతికేళ్ల క్రితం ముఖర్జీ అస్సాంనుంచి తెచ్చినాటిన టేకు వృక్షం, దాన్ని పెనవేసుకుని నేను నాటిన అడవి శంఖు పూలతీగ ఆకాశాన్నంటుతున్నట్టు కన్పించాయి. ఆ తీగ ఎంత నమ్మకంగా అల్లుకుపోయింది!

ముఖర్జీ గీసిన ఎన్నో చిత్రాల ద్వారా ఈ అడవి, కొండలు, గోదావరి, గిరిజనులు దేశ విదేశాలకు పరిచయమయ్యారు.

కాలం గతించిపోయింది. వార్ధక్యం నన్నెప్పుడు ఈ లోకంనుంచి నిష్క్రమింపజేస్తుందో తెలీదు. మనిషి ఎలా మరణించాడనేదానికంటే ఎలా జీవించాడన్నదే ముఖ్య విషయం కదా!

బైట నాగరిక ప్రపంచంలో ఉన్న సదుపాయాలేవీ ఎరుగని ఈ అటవీ పుత్రుల్లో క్రమంగా మార్పురావచ్చు. నూనె దీపాల స్థానంలో కరెంటు దీపాలుండే చోటికి వీళ్లే తరలిపోవచ్చు. శాశ్వతమనుకున్న ఈ కొండలు, అడవులు మాయంకావచ్చు. ఒక నష్టం జరిగినచోట ఒక లాభంకూడా సాధ్యంకావచ్చు. ఏ సంఘటనకైనా కార్యకారణ సంబంధాలు తప్పవు-

నిన్న సాయంకాలం నేను తెలుసుకున్న సంఘటన అలాంటిదే-

చివరి రోజుల్లో ముఖర్జీ గీసిన చిత్రాలు మళ్లీ ఒకసారి చూడాలన్పించి ఆ పెట్టె తెరిచాను.

ఒక్కొక్క చిత్రాన్నీ చూసి పక్కన పెడుతున్నాను. పెట్టె అడుగున ఒక కవరు నన్నాకర్షించింది. ముఖర్జీ ఇంత పదిలంగా దాచిన ఆ కవరు ఏమై ఉంటుందా అని తెరచి చూసాను. ముఖర్జీ పోలికల్తో ఉన్న పదేళ్ల బాలుడి కార్డు సైజ్ ఫొటోతోబాటు ఫ్రెంచ్ రైటింగ్‌లో ఒక లెటర్ ఉన్నాయందులో. ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన లెటరది. ముఖర్జీ కలకత్తా స్నేహితుడి కేరాఫ్ ఎడ్రస్‌కి వచ్చింది.

నా దగ్గర ముఖర్జీకి దాపరికమా? పట్టలేని క్యూరియాసిటీతో ఉత్తరం కింది సంతకం చూసాను. ముఖర్జీ దగ్గర చిత్రకళ నేర్చుకున్న శిష్యురాలు మరియాలిండా వ్రాసిందది.

ముఖర్జీ!

ఈ ఫొటోలోని వీడు నీ కొడుకు. నీ జ్ఞాపకం కోసం వీడికి నీ పేరే పెట్టుకున్నాను. పెరిగి పెద్దవాడై నీ అంతటి చిత్రకారుడు కావాలని కోరుకుంటున్నాను. తండ్రివి కాబోతున్నావనే మాట విని ఎంతగానో మురిసిపోయిన నువ్వు వీడి పుట్టుకకు ముందే ఈ దేశాన్ని వదిలి ఎందుకు వెళ్లిపోయావో నాకెప్పటికీ అర్థంకాని మిస్టరీ. మన బంధాన్ని స్కిప్ ఫేర్‌వెల్, నాట్ ఫర్ పెర్మనెంట్ అనుకున్నావనుకుంటాను. అవునా?

- ప్రేమతో
నీ
మరియా

నా చెయ్యి కంపించి ఉత్తరాన్ని వదిలేసింది. గుండె లోపల ఒక ముల్లు గుచ్చుకుంది. సుదీర్ఘ కాలపు కల చెదిరిపోయింది. నమ్మకం సడలిపోయింది. అనుభూతులకు వయసుతో ప్రమేయంలేదని అర్థమైంది. మనిషికి మనసుకావాలి, మనసుకు శాంతి కావాలి. కొడుకు పుట్టడంతో ముఖర్జీకి ఆ శాంతి లభించి ఉంటుందా? మరి నాకు?

ఆరిన మంట సెగకు కుందేలు పిల్ల ఒకటి వచ్చి నా వొడిలో చేరింది. మాటలు రాని సొరబ చిన్న బిందెతో నీళ్లు పట్టుకొని వస్తోంది నాకోసం.

ఈ గోదావరి, గిరిజనులు, అడవిలోని ప్రాణులు, పచ్చని ఈ ప్రకృతి అంతా నాదే, ఇంకేం కావాలి! ఇంకెంతకాలం కావాలి?

★

రచయిత్రి చిరునామా:
వైష్ణవి (కె.వరలక్ష్మి)
శ్రీ రవీంద్ర నిలయం,
శ్రీరామ్‌నగర్, జగ్గంపేట- 533435.
తూ.గో.జిల్లా.